క్లుప్తంగా

బదిలీల్లో ఖాళీలను చూపరూ..

నెల్లూరు (టౌన్): జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను బదిలీల్లో చూపాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సురేంద్రరెడ్డి, పిచ్చిబాబు కోరారు. జూమ్ యాప్ ద్వారా మంగళవారం నిర్వహించిన ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. ఎంఈఓ, హెచ్ఎం – 2, ఎస్ఏ పోస్టులకు పదోన్నతులు, బదిలీలను నిర్వహించాలని, ఈ మేరకు షెడ్యూల్లో మార్పులు చేయాలని కోరారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జనార్దన్‌రావు, ఎన్నికల కమిటీ సభ్యుడు రియాజ్, నేతలు శివకోటిరెడ్డి, కరీమ్ మొహిద్దీన్, రామ్మోహన్, వెంకటేశ్వర్లు, రామసుబ్బారెడ్డి, తులసీకృష్ణ, బాలాత్రిపురసుందరి, కొండారెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

ఇందుకూరుపేట : మండలంలోని నిడిముసలి గ్రామంలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ మహేశ్వరి అక్రమాలకు పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదులపై ఎంపీడీఓ కె.నాగేంద్రబాబు మంగళవారం విచారణ చేపట్టారు. పనికి రానివారి పేర్లతో అక్రమాలకు పాల్పడిందని గ్రామస్తులు సోమవారం ఎంపీడీఓకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన నిడిముసలి గ్రామానికి వెళ్లి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. అవినీతి జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించామని, పూర్తి విచారణ జరిపి తగిన చర్యలు చేపడుతామని ఎంపీడీఓ వివరించారు.

మనుబోలు పోలీస్‌స్టేషన్లో తనిఖీలు

మనుబోలు : మనుబోలు పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. రిసెప్షన్ భవనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. అనంతరం మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు, వివిధ కేసుల పురోగతి విషయమై మనుబోలు ఎస్సై ముత్యాలరావుతో సమీక్షించారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ

ఇందుకూరుపేట : గంగపట్నంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం చాముండేశ్వరీదేవి అమ్మవారి బ్రహ్మోత్సవాలకు సంబంధించి పోస్టర్లు, కరపత్రాల ఆవిష్కరణ ఆలయ ఆవరణలో మంగళవారం జరిగింది. ఇందుకూరుపేట కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు భక్తులు విశేషంగా తరలిరావాలని, అమ్మవారి కృపాకటాక్షం పొందాలని కోరారు. కార్యక్రమంలో ఈఓ బండి శాంతయ్య, కైలాసం ఆదిశేషారెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ కొండూరు కృష్ణారెడ్డి, నేతలు పంబాల జనార్దన్‌రెడ్డి, దండిగుంట ఫణీంద్రనాయుడు పాల్గొన్నారు.

ఖరీఫ్‌లో వరిసాగు లాభదాయకం

కొడవలూరు : ఖరీఫ్‌లో అనువైన వరి రకాలను సాగు చేయడం లాభదాయకమని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మారుతిదేవి సూచించారు. మండలంలోని దామేగుంట, తలమంచి గ్రామాల్లో ఖరీఫ్‌లో వరిసాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్‌లో ఎన్ఎల్ఆర్ 3354, ఎన్ఎల్ఆర్ 34449, భరణి, కేఎన్ఎం 1638, కేఎన్ఎం 733, ఎన్ఎల్ఆర్ 40024 రకాలు ఖరీఫ్‌లో అనువైన రకాలుగా నిర్ధారించినట్లు వెల్లడించారు. ఎరువులు, పురుగు మందుల వాడకం విషయంలో వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓలు లక్ష్మి, మధురిమ, వీఏఏలు ఎన్.ప్రసాద్, బి.లిఖిత, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా మొలక పోలేరమ్మ జాతర

ఇందుకూరుపేట : మండలంలోని కొమరిక గ్రామంలో కొలువైన మొలకపోలేరమ్మ జాతర మంగళవారం వైభవంగా జరిగింది. ఈ నేపథ్యంలో అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి దర్శనం చేసుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులు పొంగుళ్లు పొంగించి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి అమ్మవారి గ్రామోత్సవం వేడుకగా సాగింది. గ్రామస్తులు అమ్మవారికి కొబ్బరికాయ, కర్పూర హారతులు పట్టి స్వాగతం పలికారు. దీంతో గ్రామంలో కోలాహలం నెలకొంది. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

సబ్‌స్టేషన్లో ఆకస్మిక తనిఖీలు

ఇందుకూరుపేట : మండలంలోని నరసాపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎస్ఈ వెంకట సుబ్బయ్య మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యుత్ సరఫరా, సబ్‌స్టేషన్ నిర్వహణ, లోడింగ్ తదితర వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. వేసవి నేపథ్యంలో సరఫరాకు ఎటువంటి ఆటంకం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఏడీ సునీల్‌కుమార్, ఏఈ నరసింహులు ఉన్నారు.

పారిశుధ్య మెరుగునకు చర్యలు


పారిశుధ్యంపై దుకాణాల నిర్వాహకులకు సూచనలు చేస్తున్న వికాస్ మర్మత్

• కమిషనర్ వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో పారిశుధ్య మెరుగునకు చర్యలు చేపడుతున్నామని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. ఇంటింటి చెత్త సేకరణకు సంబంధించి 35వ డివిజన్లోని శానిటేషన్ మస్టర్ పాయింట్‌ను మంగళవారం తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించి మెరుగైన పారిశుధ్యానికి సహకరించాలని కోరారు. పారిశుధ్య సిబ్బంది ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైతే నోటీసులను జారీ చేయాలని ఆదేశించారు. డీకే మహిళా కళాశాల మార్గం, పోలీస్ పరేడ్ గ్రౌండ్స్, ఆర్టీసీ, మద్రాస్ బస్టాండ్, కలెక్టరేట్, తదితర ప్రాంతాల్లో చెత్త సేకరణ పనులను పర్యవేక్షించారు. తడి, పొడి చెత్త సేకరణకు గానూ ప్రతి దుకాణం బయట విధిగా డస్ట్‌బిన్లను ఉంచాలని షాపుల నిర్వాహకులకు సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

పాఠశాలల పునఃప్రారంభం నాటికి పూర్తి

నగరపాలక సంస్థ పాఠశాలల్లో నాడు – నేడు పనులను త్వరితగతిన పూర్తి చేసి స్కూళ్ల పునఃప్రారంభ సమయానికి అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్ ఆదేశించారు. మహాత్మాగాంధీనగర్ ఉర్దూ పాఠశాల, పడారుపల్లి మున్సిపల్ పాఠశాలల్లో నాడు – నేడు పనులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. అదనపు తరగతి గదులతో పాటు మరుగుదొడ్ల నిర్మాణాలను జూన్ 12 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం డ్రైవర్స్ కాలనీలోని మురుగునీటి శుద్ధి కేంద్రం, పోలీస్ కాలనీలోని మున్సిపల్ పార్కును పరిశీలించారు.

పనులు వేగవంతం

జగనన్న కాలనీల్లో నిర్మాణ పనులను పూర్తి చేసి, గృహాలను లబ్ధిదారులకు అందజేయాలని కమిషనర్ ఆదేశించారు. ఇనమడుగు లేఅవుట్, జగనన్న కాలనీలో నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఎంహెచ్ఓ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

పూర్తి స్థాయిలో మౌలిక వసతులు


సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతులను పూర్తి స్థాయిలో కల్పిస్తామని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 18వ డివిజన్లోని ఆనం వెంకటరెడ్డినగర్ కట్ట ప్రాంతంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం ఆయన నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్లను అందజేసి.. ప్రభుత్వం ద్వారా అందిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అర్హులకు సంక్షేమ పథకాలను అందిస్తున్నామని వివరించారు. స్థానిక సమస్యలను పలువురు ఆయనకు తెలియజేయగా, పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, మద్రిపాడు జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, రైల్వే బోర్డు సభ్యుడు వెంకయ్య, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, హరిబాబుయాదవ్, కార్పొరేటర్ అశోక్, నేతలు వంశీ, శివసునీల్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నెట్ సేవలు బంద్

• పెద్దాస్పత్రిలో అవస్థ
• కంప్యూటర్లు పనిచేయక నర్సులకు ఇబ్బంది


మాన్యువల్‌గా స్లిప్‌లను జారీ చేస్తున్న నర్సింగ్ సిబ్బంది

నెల్లూరు (అర్బన్): నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో నాలుగు రోజులుగా ఇంటర్నెట్ పనిచేయడం లేదు. అంతే కాకుండా కంప్యూటర్లు మరమ్మతులకు గురై మొరాయిస్తున్నాయి. ఫలితంగా ఓపీ స్లిప్‌లు ఇచ్చేందుకు నర్సులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 1200 నుంచి 1300 మంది రోగులకు ఓపీ స్లిప్‌లను ఇద్దరు నర్సులు చేతితో రాసిస్తున్నారు. వాస్తవానికి ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల్లోపే వీరందరికీ ఓపీ స్లిప్‌లను రాయాలి. స్లిప్‌లతో పాటు ఆస్పత్రి రికార్డుల్లో వీరి పేరుతో పాటు చిరునామాను సైతం రాయాల్సి ఉంది. దీంతో నర్సులకు అగచాట్లు తీవ్రమవుతున్నాయి. సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

పంపిణీకి సిద్ధంగా పాఠ్య పుస్తకాలు..


ఫతేఖాన్‌పేటలోని ప్రభుత్వ పాఠ్యపుస్తకాల మేనేజర్ కార్యాలయంలో పుస్తకాలను పరిశీలిస్తున్న సిబ్బంది


కపాడిపాళెంలోని సెయింట్ జోసఫ్స్ పాఠశాలలో నాలుగో తరగతి విద్యార్థులకు పంపిణీ చేసే పుస్తకాలను పరిశీలిస్తున్న సిబ్బంది

విద్యార్థులకు అందజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పంపిన పాఠ్య పుస్తకాలు నెల్లూరులోని ఆర్టీసీ సమీపంలో ఉన్న బుక్ డిపోకు చేరుకున్నాయి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందజేసేందుకు వీటిని సిద్ధం చేస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

క్రీడాకారుడికి అభినందన



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్ర స్థాయిలో పతకాన్ని సాధించిన బాక్సింగ్ క్రీడాకారుడు ధనుష్‌ను జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ యతిరాజ్ అభినందించారు. ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో యతిరాజ్ మాట్లాడారు. విశాఖపట్నంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి యూత్ బాక్సింగ్ పోటీల్లో నెల్లూరుకు చెందిన ధనుష్ 71 – 75 కిలోల విభాగంలో కాంస్య పతకాన్ని సాధించారని తెలిపారు. బాక్సింగ్ కోచ్ విశ్వనాథ్, బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా జాయింట్ సెక్రటరీ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్సీపీ విజయమే లక్ష్యం

నెల్లూరు (దర్గామిట్ట): ఉదయగిరి నియోజకవర్గంలో భారీ మెజార్టీతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని డీసీసీబీ మాజీ చైర్మన్, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు మెట్టుకూరు ధనుంజయరెడ్డి పేర్కొన్నారు. నగరంలో ఉదయగిరి నేతలతో ఆత్మీయ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. పార్టీ నేతలు గురవారెడ్డి, మాల్యాద్రి, అమరజీవిరెడ్డి, రాజు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఆహార పొట్లాల పంపిణీ

నెల్లూరు(బృందావనం): నగరంలోని పలు ప్రాంతాల్లో పేదలకు ఆహార పొట్లాలను రూత్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు. పేదలు, కుష్టు వ్యాధిగ్రస్తులకు వీటిని అందజేశామని సంస్థ వ్యవస్థాపకుడు పిలిక్స్ రాజ్‌కమల్ పేర్కొన్నారు.

ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి హైడ్రామా

నెల్లూరు రూరల్: నగరంలోని 29వ డివిజన్ గాంధీనగర్‌లో క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలంటూ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మంగళవారం ఉదయం హైడ్రామాను కొనసాగించారు. వాస్తవానికి సభలు, సమావేశాలకు పోలీసుల అనుమతిని తప్పక పొందాలి. అయితే ఎలాంటి అనుమతుల్లేకపోయినా కొందరు క్రైస్తవ మతపెద్దలను రెచ్చగొట్టే ధోరణిలో హైడ్రామాను నడిపారు. దీంతో దర్గామిట్ట పోలీసులు రంగప్రవేశం చేసి ఎమ్మెల్యే కోటంరెడ్డి, ఆయన అనుచరులు కొందర్ని ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేశారు. ఎలాంటి అనుమతుల్లేకుండా ఎలా చేస్తారని ఆయన్ను పోలీసులు ప్రశ్నించారు. ఎమ్మెల్యే ఆడిన హైడ్రామాకు ఆయన వర్గానికి చెందిన కొందరు టీడీపీ నేతలు వంతపాడారు.

వలంటీర్లకు సత్కారం



నెల్లూరు(బారకాసు): వలంటీర్లు నిస్వార్థ సేవలను అందిస్తున్నారని కార్పొరేటర్ గౌరి పేర్కొన్నారు. ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సూచనల మేరకు వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని 21వ డివిజన్లో మంగళవారం నిర్వహించారు. అనంతరం డివిజన్‌కు సంబంధించిన వలంటీర్లను సత్కరించారు. సురేష్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు రాజారెడ్డి, సుబ్బారావు, వెంగళ్‌రెడ్డి, అంకోజీరావు, మంజు, మాల్యాద్రి, రమేష్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్‌హెచ్‌పీలకు శిక్షణ



మాట్లాడుతున్న అధికారులు


శిక్షణకు హాజరైన సిబ్బంది

నెల్లూరు(మినీబైపాస్): నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎమ్మెల్‌హెచ్‌పీలకు శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడారు. ప్రాథమిక చికిత్స, పాముకాటు, గాయాలకు కుట్లను ఏ విధంగా వేస్తారు, తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నామని వివరించారు. అనంతరం డాక్టర్లు నీలిమ, రమాదేవి మాట్లాడారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాలతో సిబ్బందికి నైపుణ్యం పెరిగి ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు వీలు కలుగుతుందన్నారు. డాక్టర్ మురళీకృష్ణ, ఏసీఎస్సార్ వైద్య కళాశాల ప్రిన్సిపల్ హరిశ్చంద్ర సతీష్, బ్రహ్మేశ్వరనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ



నెల్లూరు(మినీబైపాస్): ఇనమడుగు పరిధిలోని లేగుంటపాడు పీహెచ్‌సీని రాష్ట్ర ప్రోగ్రామ్ అధికారి రమాదేవి, డీపీఎంఓ హరిశ్చంద్రసతీష్ ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేశారు. రక్తహీనత నివారణ చర్యలను పరిశీలించి తగు సూచనలిచ్చారు. అనంతరం నగరంలోని యూపీహెచ్‌సీల వైద్యాధికారులు, వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని ఎన్టీఆర్‌నగర్‌లోని యూపీహెచ్‌సీలో నిర్వహించారు.

28న మాదిగల ఆత్మీయ సమావేశం


మాట్లాడుతున్న సుబ్బయ్య

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలో మాదిగలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, తదితర అంశాలపై మాదిగల ఆత్మీయ సమావేశాన్ని ఈ నెల 28న నిర్వహించనున్నామని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్బయ్య పేర్కొన్నారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో విలేకరుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. కొత్తూరులో దళితులకు సంబంధించిన భూములను వారికే ఇవ్వాలని కోరారు. సమావేశానికి భారీగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ సేవా సమితి అధ్యక్షుడు శ్రీనివాసులు, నేతలు శ్రీనివాసులు, సుబ్బారావు, సునీత, రఘు, చిన్నయ్య, వెంకట్రావ్, సాల్మన్, తదితరులు పాల్గొన్నారు.

బాల్యం నుంచే దైవచింతన కలిగి ఉండాలి



నెల్లూరు(బృందావనం): బాల్యం నుంచే భక్తిభావం, దైవచింతన కలిగి దేశ ప్రగతిలో విద్యార్థులు భాగస్వాములు కావాలని అన్నమాచార్య సంకీర్తనాలయ నిర్వాహకుడు శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. శెట్టిగుంటరోడ్డులోని వీవర్స్‌కాలనీలో గల పట్టాభిరామస్వామి దేవస్థానంలో బాలరామాయణం, నామ రామాయణం, అన్నమాచార్య సంకీర్తనాలాపన సప్తాహాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అన్నమాచార్యులు సంకీర్తనలను బాలలతో మంగళవారం సాధన చేయించారు. అనంతరం బాలలకు తీర్థప్రసాదాలను అందజేశారు. వేద పండితుడు శిరోమణిశర్మ, తదితరులు పాల్గొన్నారు.

కూలిలు చెల్లించాలని వినతి

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో 2021 – 22 సంవత్సరంలో మొదటి పంటలో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రైతులకు రవాణా చార్జీలు, హమాలీలకు కూలిలను చెల్లించాలని ఏపీ రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు చిరసాని కోటిరెడ్డి కోరారు. ఈ మేరకు కలెక్టర్ హరినారాయణన్‌కు వినతిపత్రాన్ని మంగళవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ మొత్తాన్ని వెంటనే చెల్లించేలా చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని 14వ డివిజన్ పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నానని కార్పొరేటర్ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. ఉషోదయాన వీధి వీధికీ మీ కర్తం కార్యక్రమంలో భాగంగా బాలాజీనగర్, ఏసీనగర్, శ్రీనగర్ ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. దోమల నివారణకు గానూ కాలువల్లో పవర్ స్ప్రే ద్వారా మందును పిచికారీ చేయించారు. తన సొంత నిధులతో కార్యక్రమాన్ని చేపట్టానని తెలిపారు. శానిటేషన్ సెక్రటరీలు వసితారాణి, కావ్య, తదితరులు పాల్గొన్నారు.